
సాక్షి
పల్నాడు
బుధవారం । 2 । అక్టోబర్ । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 588.80 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 10,120 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బగళాముఖి ఆలయ దర్శనం

చందోలు(కర్లపాలెం): శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయాన్ని కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ మంగళవారం సందర్శించారు. అమ్మవారికి పూజలు చేశారు.



ఫ్రీడమ్ ఫైట్ పుస్తకావిష్కరణ

గుంటూరు వెస్ట్: డాక్టర్ సీఎస్ రావు ఫ్రీడమ్ ఫైట్ పుస్తకాన్ని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

ధరణికోట పొలంలో బౌద్ధశిల్పాలు



అమరావతి: మండల పరిధిలోని ధరణికోట గ్రామ కోట దిబ్బల సమీపంలో కొమ్మినేని వెంకట్రావు పొలంలో బుద్ధుని యొక్క పాలరాతి శిల్పాలు బయటపడ్డాయి. గత కొద్ది రోజుల క్రితం పొలం దున్నతుండగా భూమి అడుగన పెద్ద బండరాయి ఉందనుకుని పొక్లెయిన్‌తో బయటకు తీయగా బౌద్ధశిల్పాలు వెలుగు చూశాయి. వెంటనే రైతు స్థానిక తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు, పురావస్తుశాఖాధికారులు సమాచారమిచ్చారు. అధికారులు శిల్పాలను పరిశీలించి పురావస్తుశాఖ ఉన్నతాధికారులకు తెలియపరిచి వారి ఆదేశాల మేరకు శిల్పాలను అమరావతి మ్యూజియానికి తరలించారు. స్థానిక పురావస్తుశాఖసిబ్బంది చినబాబు శ్రీనివాస్ గోపిరాజు పాల్గొన్నారు

పింఛన్ల పంపిణీ పరిశీలన



గుంటూరు రూరల్: మండలంలోని లాలుపురం గ్రామంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ సీఈవో వి.జ్యోతిబసు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంపిణీలో అలసత్వం వహించకుండా అందరికీ సరైన సమయంలో అందించాలన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా క్లాప్ మిత్రలను సన్మానించారు. స్వర్ణాంధ్ర - 2047 కోసం క్యూఆర్ కోడ్ కార్యక్రమంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, ఈవో పీఆర్‌డీ కె శ్రీనివాసరావు, ఈవో మీనాక్షి, స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ కె.సురేష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 5,000 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 186, బ్యాంక్ కెనాల్‌కు 1,122, తూర్పు కెనాల్‌కు 105, పశ్చిమ కెనాల్‌కు 60, నిజాంపట్నం కాలువకు 116, కొమ్మమూరు కాలువకు 2,280 క్యూసెక్కుల వంతున నీటిని వదిలారు.

దాండియా నైట్.. సో క్యూట్..



నగరంపాలెం: స్థానిక ఇన్నర్‌రింగ్ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ హాల్‌లో రోటరీ క్లబ్ గుంటూరు ప్రేరణ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి దాండియా నైట్ నిర్వహించారు. సుమారు 1,400 మహిళలు కోలాటం, దాండియా, గుజరాతీ డాన్స్, మ్యూజిక్, తంబాలా వంటి వాటికి ఉత్సాహంగా నృత్యాలు చేశారు. అధ్యక్షురాలు దీప్తి నందమూరి, కార్యదర్శి దీప్తికా పాలిశెట్టి, కార్యదర్శి ఎం.చందన పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో పారా మెడికల్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి విడతగా ఆగస్టులో కౌన్సెలింగ్ నిర్వహించి కొన్ని సీట్లు భర్తీ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన వాటి కోసం ఈ నెల 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 14న కౌన్సెలింగ్ ద్వారా సీట్లు కేటాయిస్తామని చెప్పారు. వివరాలకు గుంటూరు మెడికల్ కాలేజ్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

సర్కారు మద్యం కిక్కు..

- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ
- జిల్లాలో 129 మద్యం దుకాణాలకు టెండర్లు
- ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తుకు అవకాశం
- కొన్ని నియోజకవర్గాలలో సిండికేట్‌గా మారుతున్న మద్యం మాఫియా
- ఎమ్మెల్యేలకు ముడుపులు లేదా చెప్పిన వారికి భాగస్వామ్యం
- చెప్పినట్టు వినకపోతే దుకాణాలు ఏర్పాటు కానివ్వమని బెదిరింపులు



నరసరావుపేటలోని ఎక్సైజ్ కార్యాలయం

సాక్షి, నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన మద్యం విధానంలో భాగంగా దుకాణాల ఏర్పాటుకు మంగళవారం జిల్లా ఎక్సైజ్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 129 మద్యం దుకాణాలు ఏర్పాటు కానుండగా అందులో మండలాల్లో 89 దుకాణాలు, నగర పంచాయతీల పరిధిలో 8, మున్సిపాలిటీల పరిధిలో 32 దుకాణాలకు దరఖాస్తులు పిలిచారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఒక్కో దరఖాస్తుతోపాటు రూ.2 లక్షల చొప్పున నాన్ రిఫండబుల్ అమౌంట్ జమ చేయాల్సి ఉంది. జిల్లాలో 50 వేలలోపు జనాభా ఉన్న దుకాణాలకు ఏడాదికి రూ.55 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల మధ్య జనాభా ఉన్న ప్రాంతాలలో ఏడాదికి రూ.65 లక్షలు ఫీజు చెల్లించాల్సి ఉంది. వచ్చే ఏడాది ఈ ఫీజులో 10 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో దరఖాస్తు

మద్యం దుకాణాలకు దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకునే వీలుంది. ఆన్‌లైన్‌లో ఎక్సైజ్ శాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు పూర్తిచేసి నెట్ బ్యాంకింగ్, డీడీ, కార్డుల ద్వారా రుసుం చెల్లించి ప్రక్రియ పూర్తి చేయవచ్చు. ఆఫ్‌లైన్ విధానంలో జిల్లాలో ఉన్న 10 ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లలో దరఖాస్తు చేయవచ్చు. ఒక్కో వ్యక్తి ఎన్ని షాపులకైనా, ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు, దీనికి పరిమితి అంటూ లేదు. ఈ దరఖాస్తులను 11వ తేదీ ఉదయం 8 గంటలకు నరసరావుపేటలోని టౌన్‌హాలులో జిల్లా కలెక్టర్ సమక్షంలో 129 దుకాణాలకు డ్రా తీసి దుకాణాలను కేటాయిస్తారు. డ్రాలో ఎంపికైన వ్యక్తులు అదే రోజు ఆరో వంతు వార్షిక రుసుం చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన సొమ్మును మరో ఐదు వాయిదాలలో నిర్ణీత తేదీలలో చెల్లించాలి. ఈనెల 12వ తేదీ నుంచి కొత్త మద్యం దుకాణాలు ప్రారంభించుకోవచ్చు.

సిండికేట్‌గా మారుతున్న మద్యం మాఫియా

కొత్త మద్యం విధానం పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఆన్‌లైన్ ద్వారా ఎటువంటి ఒత్తిడులు లేకుండా చేసుకోవచ్చని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ పచ్చనేతలు తమ పనిని చక్కబెడుతున్నారు. మద్యం మాఫియా సిండికేట్‌గా మారి గ్రూప్‌గా దరఖాస్తులు వేయడానికి సిద్ధమవుతున్నారు. ప్రజాప్రతినిధులు చెప్పిన వారే దరఖాస్తు చేయాలంటూ అనధికారికంగా హుకుం జారీ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులను కాదని మద్యం దుకాణం పొందిన ఏర్పాటుకు సమస్యలు సృష్టించగలమని హెచ్చరిస్తున్నారు. మద్యం దుకాణాలు పొందిన వారు ఏటా తమకు కప్పం కట్టాలని కొందరు ఎమ్మెల్యేలు టార్గెట్లు పెడుతుండగా, మరికొంత మంది తమ కార్యకర్తలు అందులో భాగస్వామ్యం ఇవ్వాల్సిందేనని ఆజ్ఞాపిస్తున్నారు. దీంతో అధికార పార్టీ తప్ప మిగిలిన పార్టీలు, వ్యక్తులు దరఖాస్తు చేయడానికి సంశయిస్తున్నారు. ఫలితంగా ఎక్సైజ్ శాఖ అనుకుంటున్న విధంగా వేలంపాటలో పాల్గొనడానికి ఎక్కువ దరఖాస్తులు రావనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడే అవకాశం ఉంది.

పూర్తి పారదర్శకంగా దరఖాస్తు ప్రక్రియ



ప్రభుత్వ కొత్త మద్యం పాలసీ ప్రకారం జిల్లాలో 129 దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఈ నెల 9 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాలలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంతమందైనా, ఎన్ని దుకాణాలకైనా పోటీ పడవచ్చు, పరిమితి లేదు. గడువు ముగిసే చివరి నిమిషంలో గందరగోళపడకుండా ముందుగానే ప్రక్రియ పూర్తి చేసుకోవడం మంచిది. మద్యం దుకాణాల దరఖాస్తు, ఎంపిక పూర్తి పారదర్శకంగా జరుగుతోంది. అక్రమాలకు చోటు లేదు.

–మణికంఠ, ఎక్సైజ్ సూపరింటెండెంట్, పల్నాడు జిల్లా

అర్హులందరికీ పింఛన్లు

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నకరికల్లు: అర్హులైన వారందరికీ పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వయంగా దివ్యాంగులైన అద్దంకి వీరాస్వామి, కట్ల అశ్వనిలకు పింఛన్‌లు అందజేశారు. దివ్యాంగులతో ప్రత్యేకంగా మాట్లాడి సకాలంలో పింఛన్ అందుతుందా లేదా అనే విషయాన్ని ఆరాతీశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి మౌలిక వసతుల కల్పనను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ వై.రాజగోపాల్, తహసీల్దార్ కె.పుల్లారావు, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో పెండింగ్ క్లెయిమ్‌లు 7139

నరసరావుపేట: జిల్లాలో పెండింగ్ క్లెయిమ్స్ 7139, చనిపోయిన ఓటర్లు 5620 మంది ఉన్నారని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.అరుణ్‌బాబు తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వచ్చే ఏడాదికి చెందిన ప్రత్యేక సారాంశ సవరణ, రెండు పట్టభద్రులు, ఒక టీచర్ నియోజకవర్గ ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి సర్వే జిల్లాలో 99.90 శాతం పూర్తిచేశామని, నిర్ణీత గడువులోపు పనులు పూర్తిచేస్తామని తెలిపారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో కె.వినాయకం, రెవెన్యూ డివిజినల్ అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఏపీ టెట్-2024

- గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు
- ఏర్పాట్లు పూర్తి
- డీఈఓ వెంకటేశ్వర్లు



నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలో ఏపీ టెట్-2024 పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులతో సమావేశం నిర్వహించి పరీక్షల్లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించినట్లు వివరించారు. గురువారం నుంచి ఈనెల 21వ తేది వరకు జరగనున్న టెట్ పరీక్షకు 9,556 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. పరీక్షను ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా నిర్వహించబడతాయని వివరించారు. పరీక్షల నిర్వహణకు 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కోటప్పకొండ రోడ్డులోని నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల అటానమస్ బ్లాక్-4, ఏ.ఎం.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, పెట్లూరివారిపాలెం, ఎంఏఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల కేసానుపల్లి పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్టు వివరించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు డీఈఓ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు ఉదయం ఏడు నుంచి రాత్రి 10 గంటల వరకు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. సందేహాల నివృత్తికి కార్యాలయ సిబ్బంది కె.ప్రసాదబాబు 9704494654, వై.తిరుపతిరావు 9177020977, జి.జీవరత్నం 9866904960, పి.శంకరరాజు 9963192487 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికులకు రక్షణేది!

- కార్మికులకు గ్లౌజులు, చెప్పులు, మాస్కులు ఇవ్వని ప్రభుత్వం
- స్వచ్ఛతా హి సేవా పేరుతో ర్యాలీలు చేస్తూ ఆర్భాటం
- ఫొటోలకు ఫోజులు ఇస్తున్న ప్రజాప్రతినిధులు
- పట్టణాల్లో 1,268 మంది పారిశుద్ధ్య కార్మికులు



నరసరావుపేటలో రక్షణ పరికరాలు లేకుండా పనిచేస్తున్న కార్మికులు

సత్తెనపల్లి: ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దటంలో వారి పాత్ర కీలకం. వర్షాలను, మండుటలను సైతం లెక్కచేయకుండా పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమయ్యే సిబ్బంది రక్షణను ప్రభుత్వం గాలికి వదిలేసింది. రోడ్లు ఊడిచేందుకు.. డ్రెయిన్‌లు శుభ్రపరిచేందుకు అవసరమైన పనిముట్లు సరఫరా చేస్తున్నా చేతులకు గ్లౌజులు, కాళ్లకు చెప్పులు, ముఖానికి మాస్కులు వంటివి ఇవ్వడం లేదు. జిల్లాలోని పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు చేతులకు పాలిథిన్ కవర్లు కట్టుకుని అట్ట ముక్కలతో చెత్తను ఎత్తడం, దుర్గంధం తట్టుకోలేక మాస్కుకు బదులు మహిళలు అయితే ముక్కుకు, నోరుకు చీర కొంగులు, పురుషులైతే వాసన తెలియకుండా ఖైనీ, గుట్కాలు వంటివి వేసుకొని పనిచేయాల్సి వస్తోంది. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛతా హి సేవా పేరుతో పట్టణాలు, పల్లెల్లో సాగుతున్న కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా ప్రజాప్రతినిధులు పెడచెవిన పెట్టి తూతూమంత్రంగా పాల్గొంటున్నారు. పాల్గొన్న ఒకటి, రెండు చోట్ల కూడా చీపుర్లు పట్టుకొని ఫొటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప శుభ్రపరిచేది ఏమీ లేదు. క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు పాల్గొంటే పారిశుద్ధ్య కార్మికుల కష్టాలు, వారి ఆరోగ్యాన్ని పట్టించుకునే అవకాశం ఉంటుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

అనారోగ్యం పాలవుతున్న కార్మికులు

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పట్టణాలు, పల్లెల్లో నిత్యం రోడ్లు ఊడుస్తూ, డ్రైన్లు శుభ్రపరుస్తూ, చెత్త ఎత్తివేస్తూ పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్న పారిశుద్ధ్య కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారు. ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా చూసేందుకు తెల్లారితే చాలు రోడ్లు, డ్రెయిన్‌ల వద్ద పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం గురించి పాలకులకు ఏమాత్రం పట్టడం లేదు. దీంతో వారు అనారోగ్యం బారిన పడుతూ కొందరు సెలవులు పెట్టడం, మరి కొందరు అనారోగ్యం నుంచి కోలుకున్నాక తిరిగి విధుల్లో చేరడం జరుగుతుంది. జిల్లాలోని అన్ని పురపాలక సంఘాల్లో పట్టణాలను, నగర పంచాయతీలను, పంచాయతీలను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేస్తున్నారు. గ్రామాల్లో అయితే డంపింగ్ యార్డ్‌లు లేకపోవడంతో ఖాళీ ప్రదేశాల్లో చెత్తాచెదారాన్ని గుట్టలుగా నిలువ చేస్తున్నారు. చెత్తను తరలించే వాహనాల నుంచి దుర్గంధం వెదజల్లుతున్నప్పటికీ చేసేదేమీ లేక పోవడంతో పారిశుద్ధ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఏవీ రక్షణ పరికరాలు

పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వారికి అవసరమైన గ్లౌజులు, మాస్కులు, చెప్పులు, సబ్బులు, కొబ్బరినూనె, యూనిఫామ్ వంటి వాటిని క్రమం తప్పకుండా పంపిణీ చేయాలి. ఏదో మొక్కుబడిగా పంపిణీ చేసి చేతులు దులుపుకుంటుండంతో అవి లేనప్పుడు పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహించక తప్పడం లేదు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు ఫొటోలకు ఫోజులిచ్చి వెళుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబర్ 2వ తేదీ వరకు పట్టణాలు, పల్లెల్లో స్వచ్ఛత హీ సేవా పేరుతో పారిశుద్ధ్యం, పచ్చదనానికి మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమాలు మొక్కుబడిగా కాకుండా ప్రజలకు స్ఫూర్తినిచ్చే విధంగా ఉండాలని, కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రక్షణ పరికరాలను అందించాలని కోరుతున్నారు.



సత్తెనపల్లిలో చేతులకు పాలిథిన్ కవర్లు కట్టుకొని పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు


జిల్లాలోని పట్టణాల్లో పారిశుద్ధ్య కార్మికులు

పురపాలకం	పర్మినెంట్ కార్మికులు	ఔట్‌సోర్సింగ్ కార్మికులు
నరసరావుపేట	66	263
సత్తెనపల్లి	24	133
చిలకలూరిపేట	40	272
వినుకొండ	23	140
మాచర్ల	36	83
పిడుగురాళ్ల	04	95
గురజాల	06	12
దాచేపల్లి	-	71
మొత్తం	199	1,069

ఇంద్ర వైభవం

వేడుకకు వేళైంది.. శరన్నవ సంబరానికి సమయం ఆసన్నమైంది.. బెజవాడ ఉత్సవ శోభను సంతరించుకుంది.. 10 రోజులపాటు ఇంద్రగిరి భక్తజనఘోషతో మార్మోగనుంది.. విశేష అలంకారాలలో దుర్గమ్మ భక్తులను కటాక్షించనుంది.. గురువారం నుంచి ప్రారంభం కానున్న దసరా నవరాత్రి ఉత్సవాలకు ఇప్పటికే దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆలయ పరిసరాలు విద్యుత్ దీప కాంతులతో మెరిసిపోతున్నాయి.

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



విద్యుత్ వెలుగుల్లో ఇంద్రకీలాద్రి ఆలయం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలకు ముస్తాబైంది. గురువారం నుంచి ప్రారంభమయ్యే శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొలి రోజున అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం అనంతరం విశేష అలంకరణ, పూజా కార్యక్రమాల తర్వాత ఉదయం 9 గంటలకు భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు.

ప్రత్యేక బస్సులు..

ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, ఒడిశాల నుంచి పెద్దఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని విశేష అలంకారాలలో దర్శించుకోనున్నారు. ఈ నేపథ్యంలో రైల్వే స్టేషన్, బస్టాండ్‌ల నుంచి దేవస్థానం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వీఐపీ టికెట్లతోపాటు రూ.300, రూ.100 క్యూలైన్లతోపాటు సర్వ దర్శనం ఏర్పాటు చేసింది. ఒకే దఫా భక్తులు 5 క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకునేలా ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. వీవీఐపీలకు ప్రత్యేక సమయంతో పాటు వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించారు. వీఐపీల కోసం సీతమ్మ వారి పాదాలు, పున్నమీ ఘాట్ల నుంచి బస్సులను ఏర్పాటు చేశారు.

ఆర్జిత సేవలకు డిమాండ్..

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి ఖడ్గమాలార్చన, విశేష చండీహోమం, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన నిర్వహించనున్నారు. మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తి వద్ద ఖడ్గమాలార్చన, ప్రత్యేక లక్ష కుంకుమార్చన జరుగుతుంది. ఆలయ ప్రాంగణంలోని మల్లికార్జున మహామండపం వద్ద ప్రత్యేక శ్రీచక్రనవార్చన, రాధాకృష్ణ విగ్రహం వద్ద నూతనంగా నిర్మించిన యాగశాలలో చండీహోమం నిర్వహిస్తారు.

దేదీప్యంగా దుర్గమ్మ కొండ

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిని రంగురంగుల విద్యుత్‌దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారి ఆలయానికి చేరుకునే కెనాల్‌రోడ్డుతో పాటు కుమ్మరి పాలెంలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అక్కడి నుంచి అమ్మవారి ఆలయానికి చేరుకునే ఘాట్‌రోడ్డు, కనకదుర్గనగర్, గోశాల, మహా మండపం పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మూడు మార్గాల్లో కొండ దిగువకు..

అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులు కొండ దిగువకు చేరేందుకు మూడు మార్గాలను ఏర్పాటు చేశారు. మల్లేశ్వరస్వామి వారి ఆలయం మెట్లతోపాటు ఈ దఫా మహా మండపంలోని క్యూలైన్ల ద్వారా భక్తులను కొండ దిగువకు అనుమతిస్తారు. మహామండపం ఎదుట నూతన భవన నిర్మాణం జరుగుతుండటంతో మల్లేశ్వరస్వామి వారి ఆలయం వద్ద మెట్లను తొలగించారు. వాటి స్థానంలో ఐరన్ మెట్లను ఏర్పాటు చేయగా, వాటిపై సాధ్యమైనంత తక్కువ మందినే అనుమతించాలని దేవస్థానం నిర్ణయించింది. అత్యవసర పరిస్థితులలో మహా మండపం లిఫ్టు పక్కనే ఉన్న మెట్లను సైతం వినియోగంలోకి తీసుకురావాలని ఆలయ అధికారులు నిర్ణయించారు.

కొలిక్కిరాని పనులు..

అమ్మవారి దర్శనానికి భక్తులు విచ్చేసే క్యూలైన్లు కొన్నిచోట్ల ఇంకా పనులు కొనసాగుతున్నాయి. కుమ్మరిపాలెం వైపు నుంచి వచ్చే భక్తులు క్యూలైన్‌లో కలిసేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. దుర్గాఘాట్, ఘాట్‌రోడ్డులోని మొదటి మలుపు వద్ద రిటైనింగ్ వాల్ విరిగిపడిన ప్రదేశంలో క్యూలైన్లు నిర్మించాల్సి ఉంది. బుధవారం మధ్యాహ్నానికి మిగిలి ఉన్న పనులు కూడా పూర్తవుతాయని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

డిజిటల్ డ్యూటీ పాస్‌లు

ఈ ఏడాది డిజిటల్ డ్యూటీ పాస్‌లను దేవస్థానం జారీచేసింది. అమ్మవారి ఆలయంలోని అధికారులు, ఉద్యోగులతోపాటు కింది స్థాయి ఉద్యోగులకు సైతం డిజిటల్ కార్డులను జారీ చేశారు. ఆలయ ఉద్యోగులతోపాటు పోలీసు, రెవెన్యూ ఇతర ప్రభుత్వ శాఖలతో పాటు మీడియా ప్రతినిధులకు సైతం ఇవే కార్డులు జారీ చేస్తున్నారు. ఈ ఏడాది డ్యూటీ పాస్‌లపై దర్శనాలను పూర్తిగా అరికట్టేందుకు దేవస్థానం డిజిటల్ కార్డులను జారీ చేస్తోంది.

25 లక్షల లడ్డూ తయారీ..

దసరా ఉత్సవాలలో అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేసే భక్తుల కోసం దేవస్థానం 25 లక్షల లడ్డూలను తయారు చేసేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం బుద్దా వారి గుడి వెనుక భాగంలో ఉన్న లడ్డూ పోటుతో పాటు కనకదుర్గనగర్ ఏనుగు షెడ్డులో లడ్డూలను తయారు చేసి ప్యాకింగ్ చేస్తున్నారు. మంగళవారం నుంచి ఉత్సవాలకు అవసరమైన లడ్డూలను తయారు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఉత్సవాలలో తొలి రోజైన బుధవారం నాటికి నాలుగు లక్షల లడ్డూలను సిద్ధం చేస్తున్నామని ఆలయ ఏఈవో పేర్కొన్నారు. భక్తులకు ప్రసాదాలను విక్రయించేందుకు గాను కనకదుర్గనగర్‌లో 11 కౌంటర్లతో పాటు బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో ఒక్కో కౌంటర్‌తోపాటు ఘాట్‌రోడ్డులో మరో కౌంటర్ ఏర్పాటు చేశారు.

వైఎస్సార్ సీపీ నాయకులపై టీడీపీ శ్రేణుల దాడి

గుంటూరు: పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు దాడులు, దౌర్జన్యాలు ఆగడం లేదు. మాచవరం మండలంలోని తురకపాలెంలో వైఎస్సార్‌సీపీ నాయకులపై అదే గ్రామానికి చెందిన టీడీపీ శ్రేణులు మంగళవారం దాడులకు తెగబడ్డారు. గ్రామ సర్పంచి షేక్ అలాబక్షు, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ రఫీ తదితరులు ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాన్ని విడిచి ఇతర ప్రాంతాల్లో, బంధువుల వద్ద తల దాచుకుంటున్నారు. పక్షం రోజుల క్రితం వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ రఫీ గ్రామానికి వచ్చాడు. ఇంట్లో ఉన్న సమయంలో టీడీపీ నాయకులు కొందరు రఫీపై దాడిచేసి తమపైనే దాడి చేశారంటూ పోలీసులకు రఫీపై ఫిర్యాదు చేశారు. రఫీపై అక్రమ కేసులు బనాయించి కోర్టులో హాజరు పరిచారు. బెయిల్‌పై గ్రామానికి తిరిగి వచ్చిన రఫీపై మరోసారి దాడిచేసి దుకాణం తాళాలు తెరవద్దంటూ హుకుం జారీ చేసి దాడికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని గ్రామ సర్పంచి షేక్ అల్లాబక్షు, రఫీలను దాచేపల్లి పోలీసు కార్యాలయానికి తరలించినట్లు సమాచారం.

4న వినుకొండలో జాబ్ మేళా

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి శిక్షణ సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన వినుకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు మంగళవారం తెలిపారు. జాబ్ మేళాకు శ్రీదత్తా హాస్పిటల్, మాస్టర్ మైండ్స్, ఐలా అగ్రి సర్వీసెస్, సింధుజ మైక్రో క్రెడిట్స్ వంటి సంస్థలు హాజరై అర్హులైన అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటారని వివరించారు. జాబ్ మేళాకు 10వ తరగతి నుంచి పీజీ, డిప్లొమో, బీటెక్, ఫార్మసీ విద్యార్హత ఉన్న నిరుద్యోగ యువత నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. వివరాలకు డి.జానీబాషా 9951214919, జె.సురేష్ 9100566581 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ సీ అండ్ బీ ఏఈఈగా హిమబిందు



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్యాంప్స్ అండ్ బిల్డింగ్స్ ఏఈఈగా బి.హిమబిందు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. హిమబిందు మాచర్ల పీడబ్ల్యూడీ కాలనీలో క్యాంప్స్ అండ్ బిల్డింగ్స్ ఏఈఈగా విధులు నిర్వహించి సాగర్‌కు బదిలీపై వచ్చారు. అలాగే ఇప్పటి వరకు నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్యాంప్స్ అండ్ బిల్డింగ్స్ ఏఈఈగా పనిచేసిన కేవీ కోటేశ్వరరావు మాచర్ల ఓఅండ్ఎం డివిజన్ డిజైన్స్‌కు బదిలీ అయ్యారు. మెయిన్ కెనాల్ మానిటరింగ్ ఏఈఈగా వెంకటసుబ్బయ్య, సాగర్ ప్రాజెక్ట్ గేట్స్ ఏఈఈగా అనిత శ్రీ బాధ్యతలు చేపట్టారు. వాటర్ సప్లై ఏఈఈగా పనిచేసిన లక్ష్మీనారాయణ దుగ్గిరాలకు, మెయిన్ కెనాల్ మానిటరింగ్ ఏఈఈ యుగంధర్ వినుకొండకు, సాగర్ ప్రాజెక్ట్ గేట్స్ ఏఈఈ బాబూమియా నెల్లూరులోని సోమశిల ప్రాజెక్టుకు బదిలీ అయ్యారు.

అండర్-17 జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



తెనాలి: గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్ స్టేడియంలో మంగళవారం అండర్-17 బాలుర హ్యాండ్‌బాల్ జిల్లా జట్టును ఎంపిక చేశారు. 80 పాఠశాలల నుంచి 80 మంది పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరచిన 16 మందిని ఎంపిక చేశారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో రాష్ట్రస్థాయి పోటీల్లో గుంటూరు జిల్లాకు వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. గుంటూరు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, స్కూల్ గేమ్స్ సహాయ కార్యదర్శి సీహెచ్ వినయ్‌కుమార్, కోచ్ కె.నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు కిషోర్, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉరకలేసిన క్రీడోత్సాహం

- పెదమక్కెనలో రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలు ప్రారంభం
- పాఠశాలలు, కళాశాలల్లో క్రీడలను తప్పనిసరి చేయాలి
- సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ
- నేడు సెమీ ఫైనల్, ఫైనల్ పోటీలు, విజేతలకు బహుమతులు ప్రదానం



పోటీల్లో తలపడుతున్న ప్రకాశం- అనంతపురం క్రీడాకారులు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం పెదమక్కెనలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రగతి జూనియర్ కళాశాల నేతృత్వంలో ప్రారంభమైన ఆంధ్రప్రదేశ్ 68వ స్కూల్ గేమ్స్ సెపక్ తక్రా రాష్ట్ర స్థాయి బాల, బాలికల క్రీడా పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా బాలుర జట్లు 11, బాలికల జట్లు 10 హాజరయ్యాయి. 120 మంది క్రీడాకారులతో పాటు 11 మంది కోచ్‌లు, 10 రిఫరీలు, వ్యాయామోపాధ్యాయులు, క్రీడాభిమానులు హాజరు కావడంతో గ్రామం అంతా పండుగ వాతా వరణం నెలకొంది. రాష్ట్ర స్థాయి బాల, బాలికల సెపక్ తక్రా క్రీడా పోటీలను ప్రారంభించేందుకు ముఖ్య అతిథిగా సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ హాజరై క్రీడా కారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో సెపక్ తక్రా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనివాసులు, టోర్నమెంట్ రాష్ట్ర పరి శీలకులు సి.మారుతీ ప్రసాద్, అండర్-19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు, సహాయ కార్యదర్శి సి.హెచ్.పద్మాకర్, ఇంటర్ క్రీడల కార్యదర్శి ఎస్.సుధాకర్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శివరామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు బి.అనీల్ దత్తా నాయక్, లాకు పిచ్చయ్య, కె.కిరణ్ కుమార్, గ్రామ సర్పంచ్ ఎమ్. అన్న పూర్ణమ్మ పాల్గొన్నారు.

బాల,బాలికల జట్ల ఫలితాలు....

ఆంధ్రప్రదేశ్ 68వ స్కూల్ గేమ్స్ సెపక్ తక్రా రాష్ట్ర స్థాయి బాల,బాలికల క్రీడా పోటీలు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించారు. క్వార్టర్స్‌లో లీగ్, నాకౌట్ పూర్తయయ్యాయి. బుధవారం సెమీ ఫైనల్, ఫైనల్ పోటీలు నిర్వహించనున్నారు. జాతీయ స్థాయి జట్టు క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు. ఎంపికై న బాలురు జాతీయ స్థాయిలో మణిపూర్‌లో త్వరలో జరిగే పోటీల్లో ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. బాలికలు జాతీయ స్థాయిలో ఈ నెల 28, 29, 30న మూడు రోజుల పాటు నాగాలాండ్‌లో జరిగే పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. బాలుర విభాగంలో ... వైఎస్సార్ కడప జట్టుపై కర్నూలు, గుంటూరు జట్టుపై నెల్లూరు జట్టు, అనంతపురం జట్టుపై ప్రకాశం జట్టు, విజయనగరం జట్టుపై పశ్చిమగోదావరి జట్టు విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరాయి. బాలికల విభాగంలో నెల్లూరు జట్టుపై అనంతపురం జట్టు, వైఎస్సార్ కడప జట్టుపై కర్నూలు జట్టు, గుంటూరు జట్టుపై పశ్చిమ గోదావరి జట్టు, విజయనగరం జట్టుపై కృష్ణా జట్టు విజయం సాధించి సెమీ ఫైనల్‌కి చేరాయి.

క్రోసూరు ఫైర్ స్టేషన్ పునఃప్రారంభం



ప్రారంభిస్తున్న డీఎఫ్‌ఓ ఎస్ శ్రీధర్

క్రోసూరు: క్రోసూరు ఫైర్ స్టేషన్ (అవుట్‌పోస్టు) మంగళవారం పునఃప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా ఫైర్ సేఫ్టీ అధికారి ఎస్.శ్రీధర్ పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు నియోజకవర్గంలోని క్రోసూరు, అచ్చంపేట , బెల్లంకొండ శివారు, అమరావతి మండలంలోని ధరణి కోట వరకు, పెదకూరపాడు మండలంలోని 10 గ్రామాలకు అందుబాటులో ఉంటుందని అన్నారు. సర్వీస్ ప్రొవైడర్ ఎం.ప్రసాదరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సహకారంతో అవుట్ పోస్టు ప్రారంభించినట్లు చెప్పారు. ఏఎఫ్ఓ సుబ్బారావు మాట్లాడుతూ ప్రజలు తమకు ఏదైనా అగ్నిప్రమాదాలు సంభవించిన పుడు తక్షణమే ఫోను 08640- 227848కు ఫోను చేయవచ్చునన్నారు.

4న స్టాఫ్‌నర్సులకు ప్రమోషన్ కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో స్టాఫ్‌నర్సులుగా పనిచేస్తున్న వారికి ఈ నెల 4న ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. హెడ్ నర్సులుగా పదోన్నతి ఇవ్వనున్నట్లు గుంటూరు ప్రాంతీయ వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ కె.సుచిత్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆర్డీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ప్రమోషన్ జాబితాలో ఉన్న వారు స్పౌజ్, సోషల్ స్టేటస్, స్పౌజ్ చనిపోతే విడో, అంగవైకల్యం ఉంటే సంబంధిత సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

యార్డులో 65,463 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 63,626 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 65,463 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 16,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,700 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 25,489 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఏఎన్‌యూ స్పోర్ట్స్ క్యాలెండర్ విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ క్రీడా బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం రూపొందించిన 2024 -25 వార్షిక స్పోర్ట్స్ క్యాలెండర్‌ను మంగళవారం వీసీ ఆచార్య కె గంగాధరరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలకు కేటాయించిన షెడ్యూలు ప్రకారం ఆయా క్రీడలను నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు ఈ పోటీలను అన్ని కళాశాలలో ఏర్పాటు చేయాలన్నారు. రెక్టార్ ఆచార్య కె. రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, వ్యాయామ విద్యాశాఖ డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్, వ్యాయామ విద్య కళాశాల యోగా విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ డి. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతులను మోసగించిన వారిపై కేసు

గుంటూరు రూరల్: కోల్డ్ స్టోరేజీ నిర్వాహకులు తమను నమ్మించి నట్టేట ముంచారనే రైతుల ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లపాడు రోడ్డులోని రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజీ, తియ్యగూర కోల్డ్ స్టోరేజీలను రామచంద్రరావు అద్దెకు తీసుకున్నారు. వాటిలో నిల్వ ఉంచిన మిర్చి బస్తాలను సంబంధిత రైతులకు తెలియకుండా విక్రయించటం, వాటిపై రుణాలు పొందడం వంటి మోసాలకు పాల్పడ్డారు. రామచంద్రరావు తదితరులపై కర్నూలు, ప్రకాశం , గుంటూరు జిల్లాలకు చెందిన పలువురు రైతుల ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు పెదకాకానిలో 'దేవర' సక్సెస్ మీట్



పెదకాకాని: జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర' చిత్రం సక్సెస్ మీట్ గురువారం పెదకాకాని మండలం నంబూరు వద్ద నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆర్గనైజర్స్ శ్రీయాస్ మీడియా యజమాని శ్రీనివాసరావు తెలిపారు. జాతీయ రహదారి పక్కనే నంబూరు అడ్డరోడ్డు సమీపంలో వేడుక నిర్వహించే ప్రదేశాన్ని మంగళవారం మంగళగిరి నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ, పెదకాకాని సీఐ టి.నారాయణస్వామి, ఎస్ఐ షేక్ మిరాజ్, నంబూరు హరి (ట్రాక్టర్ కంపెనీ) తదితరులు పరిశీలించారు. బందోబస్తు, ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై చర్చించారు.

అంతర్జాతీయ పోటీలకు తెనాలి పవర్ లిఫ్టర్



మంగళగిరి: ఈ నెల 4 నుంచి 13వ తేదీ వరకు సౌతాఫ్రికాలో జరగోయే కామన్‌వెల్త్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్ పోటీలలో పాల్గొనే ఇండియన్ టీమ్‌లో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన పవర్ లిఫ్టర్ నాగం జ్ఞానదివ్య చోటు దక్కించుకుంది. జూనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్‌లో ప్లస్ 84 కేజీల విభాగంలో ఆమె అర్హత సాధించినట్లు గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని మంగళవారం తెలిపారు. పోటీలలో ఆమె పతకం సాధించాలని ఆకాంక్షించారు.

వరి సాగులో విత్తన ఎంపికే కీలకం

రేపల్లె రూరల్: వరి సాగులో విత్తన ఎంపిక కీలకమని బాపట్ల వ్యవసాయ పరిశోధనా కేంద్రం జన్యు ప్రజనన విభాగపు అధికారి టి.హరిత చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని బేతపూడి 1, 2 గ్రామాలలో మంగళవారం క్షేత్ర పర్యటనలో ఆమె పాల్గొన్నారు. రైతులకు సూచనలు చేశారు. బీపీటీ-5204కు ప్రత్యామ్నాయంగా అనేక రకాలు ఉన్నాయని పేర్కొన్నారు. బీపీటీ 2846, 2782 రకాలతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. బ్లాక్ రైస్, రెడ్ రైస్ వంటి రకాలను సాగు చేయటంతో అనేక ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు. మధుమేహం, క్యాన్సర్, హృద్రోగ సమస్యలను ఎదుర్కొనే రోగ నిరోధక శక్తి వీటి ద్వారా పెరుగుతుందని చెప్పారు. ఐరన్, పీచు పదార్థాలు అధికంగా లభిస్తాయని పేర్కొన్నారు. రైతులు తమ సందేహాలను వ్యవసాయ అధికారులకు తెలిపి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఆర్.విజయ్‌బాబు, వీఆర్వో ఎ.వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రటరీ అనూష, డిజిటల్ అసిస్టెంట్ ఎస్.హారిక, ఏఈవో బి.తేజస్విని, వీఏఏలు పి.ప్రసాద్, కె.రాయల్‌బాబు, వెటర్నరీ అసిస్టెంట్ రెడ్డి, ఫిషరీస్ అసిస్టెంట్ ఎస్.నాగపావని, వీఆర్ఏ షేక్ ఆదమ్ షఫీ పాల్గొన్నారు.

ఇసుక సరఫరాలో ఇబ్బందులు తీర్చాలని వినతి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి విన్నవించిన క్రెడాయ్ ప్రతినిధులు



జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

గుంటూరు వెస్ట్: ఇసుక అందుబాటులో లేకపోవడంతో జిల్లాలో నిర్మాణ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటుదని క్రెడాయ్ ఏపీ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ.. నిర్మాణ రంగంతోపాటు కార్మికులు కూడా ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఇసుక రీచ్‌లను త్వరగా ప్రారంభించి కష్టాలు తీర్చాలని కోరారు. స్పందించిన కలెక్టర్ 10, 15 రోజుల్లోనే ఇసుక రీచ్‌లు ఓపెన్ చేయించనున్నట్లు హామీ ఇచ్చారు. క్రెడాయ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.వినోద్ రెడ్డి, వి.శివనాగేశ్వరరావుతోపాటు పి.సాహిత్, ఎం.శంకర్ రాజగోపాల్ పాల్గొన్నారు.

నిర్దేశిత గడువులోగా ఓటరు కార్డుల ప్రక్రియ

గుంటూరు వెస్ట్: స్పెషల్ సమ్మరీ రివిజన్ -2025కు సంబంధించి ఓటర్ల జాబితా ఇంటింటి వెరిఫికేషన్‌తోపాటు ఇతర అంశాలను నిర్దేశించిన సమయంలో పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ నిర్వహించిన వీడియో సమావేశంలో స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ.. ఇంటింటి ఓటరు వెరిఫికేషన్ 99.56 శాతం పూర్తయ్యిందన్నారు. దరఖాస్తులను వెరిఫికేషన్ చేసి ఈ నెల 5 నాటికి ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. మరణించిన వారి పేర్లు మార్గదర్శకాల ప్రకారం తొలగించాలన్నారు. బూత్‌ల జియో మ్యాపింగ్ అప్‌డేట్‌తోపాటు రేషనలైజేషన్, ఇతర మార్పులపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వివరాలు సేకరించాలని సూచించారు. జిల్లాలో ఈఆర్వోల వివరాలు అప్‌డేట్ చేవామన్నారు. బదిలీలు పూర్తయిన వెంటనే ఏఈఆర్వోలు, బీఎల్వోలవి అప్‌డేట్ చేస్తామని చెప్పారు. ఉన్నత విద్యా సంస్థల్లో ఓటర్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దీనికి ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించామని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం స్పెషల్ సమ్మరీ రివిజన్ -2025 ఓటర్ల జాబితా రూపొందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీ కుమారి, గంగరాజు, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వాహనాలు నడిపే మైనర్లపై చర్యలు తీసుకోండి

రేపల్లె రూరల్: రేపల్లె పట్టణంలో మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నందున కౌన్సెలింగ్ నిర్వహించాలని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్స్ నేషనల్ కో ఆర్డినేటర్ పిన్ని సాంబశివ రావు అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఇలాంటి మైనర్లపై పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో దొంగతనాలు ఎక్కువైనందున పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సీసీ కెమెరాలు సక్రమంగా పని చేయడం లేదని, మరమ్మతులు చేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ అండ్ టీఎస్ స్టేట్స్ మీడియా ప్రెసిడెంట్ కారుమూరు హనోక్‌బాబు, సభ్యులు ఎల్.సుధాకర్, జి.ముత్తయ్య, ఆర్.యాకోబు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: విజయనగరంలో ఈ నెల 6, 7, 8వ తేదీల్లో జరగనున్న ఏపీటీఎఫ్ 20వ విద్యా, వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం నగరంపాలెంలోని సంఘ జిల్లా కార్యాలయంలో మహాసభల పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వేళాంగిణిరాజు, కె. నరసింహారావు, జిల్లా సహాధ్యక్షుడు ఓ.నాగార్జున, అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.సాయన్న, నాయకులు ఆనంగి శ్రీనివాస్, జె. విజయానంద్, జీఎస్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో నగరంలో పోలీస్ 'షీ బృందాలు'



మాట్లాడుతున్న గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: త్వరలో గుంటూరు నగరంలోని కళాశాలలు, పాఠశాలల వద్ద మఫ్టీలో, యూనిఫాంలో షీ బృందాలు విధుల్లో ఉంటాయని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. గుంటూరు నగరంలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యజమానులతో మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. గత నెలలో నిర్వహించిన సమావేశంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలకు సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకున్నామని అన్నారు. పాఠశాలలో, కళాశాలలో ఏదైనా ఘటన జరిగితే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100, 86888 31568 నంబర్లకు సమాచారం అందించాలని అన్నారు. పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య ఉంటే కూడా పోలీసుల దృష్టికి తేవాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు అబ్దుల్ అజీజ్ (తూర్పు), జయరాం ప్రసాద్ (పశ్చిమ), బి.సీతారామయ్య (ఎస్‌బీ), తూర్పు, పశ్చిమ ట్రాఫిక్ సీఐలు ఎ.అశోక్‌కుమార్, సింగయ్య, ఎస్‌బీ సీఐ శ్రీనివాసరావు, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సంఘం సభ్యులు కరీముల్లా, లక్ష్మణ్, హుస్సేన్, మైలా సాంబశివరావు పాల్గొన్నారు.

ఇసుక లేక భవన నిర్మాణ కార్మికుల అవస్థలు

రేపల్లె రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పథకాన్ని సక్రమంగా వెంటనే అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు పి.నాగాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం ఆర్డీవో కార్యాలయ ఆవరణలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉచిత ఇసుక హామీ అమలు కాకపోవడంతో రాష్ట్రంలో లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారని పేర్కొన్నారు. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోవటంతో వారు పస్తులు ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికలలో హామీ ఇచ్చినట్లుగా కార్మికుల స్కీములన్నీ అమలు చేయాలన్నారు. ఉచిత ఇసుక ఆన్‌లైన్ విధానంలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. కొన్నిచోట్ల ఇసుక బదులు మట్టి వస్తోందన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నాగయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఏరియా అధ్యక్షుడు జి.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.